# ఏడుపుగొట్టు కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

## సంతోషం X సంతోషం = ఏడుపు




ఆఫీసునుండి హుషారుగా వస్తున్న కృష్ణమూర్తి సడన్ బ్రేక్ వేసినట్లు గుమ్మందగ్గర ఆగిపోయాడు.

లోపలనుండి ఆర్తనాక్యరాగం లయబద్ధంగా కర్ణకఠోరంగా వినిపిస్తోంది.

"ఏమిటి ఈరోజు శ్రీమతిగారు ఏడుపురాగం ఆలాపిస్తున్నారు?" అంటూ లోపలికి అడుగు పెట్టాడు. లోపల కాంతం నేలమీద కూర్చుని ఏడుస్తోంది. కాంతం, కృష్ణమూర్తిల పెండ్లి అయి రెండు సంవత్సరాలు అయింది. ఒక పుత్రరత్నం కూడానూ! కాంతం ఏం కావాలన్నా ఏడుపు ద్వారా సాధించు కుంటుంది. కాంతం ఏడిస్తే కృష్ణమూర్తికి ఇష్టం ఉండదు. ఎటువంటి కోరిక కోరినా కాదనడు.

బట్టలు మార్చుకుని కాంతం దగ్గరకు వచ్చాడు కృష్ణమూర్తి. "మొదలుపెట్టావా! నీ ఏడుపు, ఏం కావాలో చెప్పి ఏడు" అన్నాడు.

కాంతం దగ్గరనుండి సమాధానం లేదు.

"ఎందుకు ఏడుస్తున్నావు కాంతం! చెప్పి ఏడు. అంతగా ఏడవవలసిన విషయం అయితే నేనూ నీతో కలిసి ఏడుస్తాను.అంతేగాని నువ్వలనవసరంగా ఏడుస్తూ, నన్ను ఏడిపించకు" అన్నాడు.

కాంతం సమాధానం చెప్పకుండా ఏడుస్తూనే ఉంది.

"ఎందుకూ పట్టుచీర కోసమేగా నువ్వు ఏడుస్తున్నది? మళ్ళీ నెల్లో తప్ప కొంటానుగా!" అన్నాడు కృష్ణమూ ర్తిలనగా.

"నేను అందుకోసం ఏడవట్లేదు" అంది కాంతం ఏడుస్తూనే.

"మరి ఇంకెందుకు. పక్కింటి వాళ్ళ ఇంట్లో ఉన్న వస్తువులు మన ఇంట్లో లేవని ఏడుస్తున్నావా? ఏడుపు మొహం వేసుకొని పక్కింటి వాళ్ళని చూసి ఏడవ వద్దని, నీకు లక్షసార్లు చెప్పాను. పక్కాయనికి నాకన్నా ఎక్కువ జీతం ఏడిసింది" అన్నాడు విరాగ్గా.

"నేను అందుకోసం ఏడవటంలేదు" అంది కాంతం ఏడుస్తూనే.

"మీ ఇంటికి వెడతావా?"




"నా జీతంలో సగం నీ ప్రయాణాలకి అయిపోతోంది. ఆరోజు మీ నాన్న నా కాళ్ళు పట్టుకుని ఏడ్చాడు. నిన్ను పెళ్ళి చేసుకొని ఏడవమని. నిన్ను పెళ్ళి చేసుకొని ఏం సుఖపడ్డాను? నీ భయంకరమైన ఏడుపు రోజూ విన్లేక ఏడుస్తున్నాను."

"నేనేమీ మా ఇంటికి వెడతానని ఏడవట్లేదు" అంది కాంతం.

లోపలనుండి ఇంకోరాగం వినపడింది కృష్ణమూర్తికి.

"కాంతం బాబు లేచినట్లున్నాడు. ఏడుస్తున్నాడు. వాడి ఏడుపు ఆపి, తీరిగ్గా కూర్చుని ఏడు" అన్నాడు.

కాంతం లేవలేదు.

"నీకేనే చెపుతున్నాను. వాడు లోపల గుక్కపట్టి ఏడుస్తున్నాడు. నీ ఏడుపు నీదేగానీ వాడి ఏడుపు పట్టించుకోవా?" అన్నాడు విసుగ్గా.

కాంతం దగ్గరనుండి సమాధానం లేదు.కృష్ణమూర్తి లోపలికెళ్ళి బాబును ఊరుకోపెట్టి వచ్చాడు.

"కాంతం! ఎప్పుడో ప్రొద్దుట రెండు మెతుకులు తిన్నాను. కడుపులో ఎలకలు ఏడుస్తున్నాయి. నీ ఏడుపు ఆపి త్వరగా వంటచేసి ఏడు, సినిమాకి ఏడుద్దాం" అన్నాడు.

"నేను రాను" అంది కాంతం.

"పట్టుచీర అక్కర్లేదు. మీ ఇంటికి వెళ్ళవు. సినిమాకి రావు" మరి దేనికి ఏడుస్తున్నావు? ఏదైనా ఒలింపిక్స్‌లో ఏడుపు పోటీలు పెడితే ప్రాక్టీసు చేస్తున్నావా?" అనవసరంగా నన్నేడిపించక విషయం ఏమిటో చెప్పి ఏడు" అన్నాడు.

కాంతం సమాధానం చెప్పలేదు.

"సరే! ఎంతసేపు ఏడుస్తావో ఏడు" అని కృష్ణమూర్తి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

డ్రాయరుమీద ఉన్న "ఆంధ్రభూమి" తీసుకుని మొదటి పేజీ చదివి, స్పృహ తప్పబోయి, తట్టుకుని "ఏమేవ్! కాంతం నీకో మంచివార్త చెపుతాను ఏడుపు మానేస్తావా?" అన్నాడు.

"ఏమిటి?" అంది కాంతం తాత్కాలికంగా ఏడుపు ఆపి.

ఇదిగో నీ అభిమాన "ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక" ఇకముందు ఆలస్యం అవకుండా కరక్టు టయానికి వస్తుందిట" ఈ మొదటి పేజీలో పెద్దపెద్ద అక్షరాలతో రాసారు చూడు" అన్నాడు.

"నేను అందుకే ఏడుస్తున్నాను" అంది కాంతం.

"ఇది శుభవార్తేగా! ఏడవటం ఎందుకు?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఆ వార్త చదివాక సంతోషం పట్టలేక, సంతోషాన్ని ఆపుకోలేక ఏడుపు వచ్చేసిందండీ!" అంది కాంతం చిరునవ్వు చిందిస్తూ..

"ఏడ్చినట్లుంది" అన్నాడు కృష్ణమూర్తి దీర్ఘంగా ఏడుస్తూ సారీ నిట్టూరుస్తూ..

(ఆంధ్రభూమికి, ఆంధ్రభూమిమీద కథరాసి పంపుతున్నందుకు, ఆంధ్రభూమికి క్షమాపణలతో...)

— జి. రామమూర్తి శాస్త్రి

(హైదరాబాద్)